

టమోటా @ రూ.140

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులు పండించిన టమోటాకు గిట్టుబాటు ధరలేక పొలాల్లోనే వదిలేసిన, రోడ్లపై పారేసిన ఘటనలు ఎన్నో చూశాం. కానీ ఇప్పుడు ఆ టమోటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మంగళవారం మదనపల్లె టమోటా మార్కెట్లో 10 కిలోల టమోటా గరిష్ఠంగా రూ.1400 పలకగా కనిష్ఠంగా రూ.1220 పలికింది. కిలో రూ.140కు ఎగబాకింది. టమోటాలను మధ్యతరగతి కుటుంబాలు కొనలేక అవస్థలు పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా టమోటా ధరలు రూ.140 చేరడంతో ప్రజలు కూరగాయలు కొనాలంటే గగ్గోలు పెడుతున్నారు.



బీడీ కార్మికులను ఆదుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బీడీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఒక్కొక్క కుటుంబానికి రూ.పది వేలు సాయం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాయచోటి పట్టణంలో కొత్తపల్లెలోని జెండా మానువీధి, రమీజా భానువీధి మేదరవీధి, కందకవీధి, నాయబ్ సాహెబ్ వీధి బీరాన్ సాహెబ్ వీధి పాతరాయచోటిలోని బీడీ కార్మికులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు వెయ్యి బీడీలు చుడితే కేవలం రూ.200 నుండి రూ.240 ఇస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో పాటు ఇంటి పన్ను చెత్తపన్ను విద్యుత్ ఆర్టీసీ చార్జీలు వైద్య ఖర్చులు పెరగడంతో వారికి సరిపోదని పేర్కొన్నారు. కేరళ, ఇతర రాష్ట్రాల మాదిరి వెయ్యి బీడీలకు రూ.500 ఇచ్చి ఆదుకోవాలన్నారు. బీడీ కార్మికుల ఆసుపత్రులలో కూడా కొరత ఉందని ప్రభుత్వాల వైఫల్యం వలన డిస్పెన్సరీలు మూతపడేదశలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. బీడీ కార్మికులు సుదీర్ఘంగా కూర్చొని బీడీలు చుట్టడం వలన నడుంనొప్పి, ఆస్తమా, కిడ్నీ ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీడీ కార్మికుల సమస్యల మీద ఈ నెల 13 నిర్వహించనున్న నెల్లూరులో రాష్ట్ర సమావేశానికి పెద్ద ఎత్తున బీడీ కార్మికులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, ఓబులమ్మ, నాయకులు సుహాసిని, రాధ పాల్గొన్నారు.


బీడీ కార్మికులతో మాట్లాడుతున్న ఓబులు

ఇంటర్ అడ్మిషన్లపై ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫో డాట్‌కామ్‌లో నమోదు చేయాలని కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం పట్టణంలో ఓ కల్యాణ మండపంలో ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఇంటర్‌లో విద్యార్థులు చేరిక, చైల్డ్ ఇన్ఫోడాట్ కామ్ ఆన్‌లైన్ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ చేసి చైల్డ్ ఇన్ఫోడాట్ కామ్‌లో నమోదు చేయాలన్నారు. 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఇంటర్ మొదటి సంవత్సరంలోకి జాయిన్ అవుతున్నారన్నారు. మిగిలిన 40 శాతం మంది ఎక్కడికి పోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేకంగా 10 పాసైన ప్రతి విద్యార్థి ఇంటర్‌లో ప్రవేశం పొందేల చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 2.70 లక్షల మంది విద్యార్థులు ఉండగా 2.58 లక్షల మంది విద్యార్థుల నమోదు చేశారని, జిల్లా మొత్తం 95 శాతం నమోదు చేశారని పేర్కొన్నారు. మిగిలిన ఐదు శాతం కూడా నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతులై ఇంటర్ మొదటి సంవత్సరానికి చాలా మంది విద్యార్థులు జాయిన్ కావడం లేదన్నారు. కళాశాల ప్రిన్సిపల్స్, విద్యాశాఖ అధికారులు అడ్మిషన్ల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జాయిన్ అయిన విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోడాట్ కామ్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో 130 కాలేజీలకు 50 కాలేజీలు మాత్రమే విద్యార్థులు మొదటి సంవత్సరం చేరినట్లు ఎన్‌రోల్‌మెంట్ చేశారని తెలిపారు. మిగిలిన కళాశాలలో కూడా త్వరగా ఎన్‌రోల్‌మెంట్ చేయాలన్నారు. ఎవరిని మిస్ చేయకుండా డేటా ఎంట్రీ చేయాలన్నారు. జాయిన్ అయిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో వీలైనంత త్వరగా నమోదు చేయాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పూర్తయిన తర్వాత ఇంకా మిగిలి ఉన్న విద్యార్థుల మీద దృష్టి పెట్టి వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలలో విద్యార్థులు ప్రవేశం పొందేల ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాళ్లను సూచించారు. డేటా ఎంట్రీ చేయని కాలేజీల వారీగా కలెక్టర్ సంబంధిత ప్రిన్సిపాల్‌ను వివరాలను అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డివిఇఒ కృష్ణయ్య నాయక్, ఆర్ఐఒ రవి, డిఇఒ పురుషోత్తం, ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌లు పాల్గొన్నారు.

రమణీయం.. సౌమ్యనాథుని కల్యాణం


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన 'మేడా'
భారీగా తరలివచ్చిన ప్రజానీకం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో చారిత్రాత్మక, సుప్రసిద్ధ వైష్ణవ దేవాలయమైన శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవం కమనీయంగా... రమణీయంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణం చూచువారులకు చూడ ముచ్చటగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కళ్యాణ వేదికను అలంకరించారు. వేద పారాయణులు సంతోష్ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో టిటిడి అర్చకులు సునీల్ కుమార్ శర్మ,సాయి కృష్ణ శర్మ, బాలస్వామి, రుత్వికులు శ్రీనివాస్, ఎంజి కృష్ణ తరుణ్ పార్థసారథి, భార్గవ్, సీతారాం, ప్రశాంత్, మనోజ్ కుమార్, పవన్ ఆచార్యులు శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కళ్యాణ వేదిక పైన ఆశీనులు గావించారు. పండితుల మంత్రోచ్చారణలు, భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఉదయం అభిజిత్ లగ్నమందు కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్య ధారణ ,ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాలను సమర్పించిన 'మేడా' : స్వామివారి కల్యాణ వేడుకకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ముత్యాల తలంబ్రాలను, పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.


కల్యాణానికి హాజరైన ప్రజలు, భక్తులు


సౌమ్యనాథుని కల్యాణంలో మాంగల్యం చూపుతున్న వేదపండితులు

కల్యాణానికి హాజరైన ప్రముఖులు : సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవానికి ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేడా పద్మజ, జడ్‌టిసి గడికోట ఉషారాణి, సిద్ధవటం వైసిపి ఇన్‌ఛార్జ్ మేడా మధుసూదన్‌రెడ్డి, ఆర్‌టిసి మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, జనసేన నాయకులు అతికారి దినేష్, సినీ నటులు వేణు, సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సోమిత్రిచంద్రనాథ్, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ భువనబోయిన లక్ష్మీనరసయ్య హాజరయ్యారు. వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

భక్తులకు అన్నదానం : కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు మెంబర్ మేడా రామకృష్ణారెడ్డి, ఎంఆర్‌కెఆర్ కన్స్ట్రక్షన్ అధినేత మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో, గంగమ్మ సర్కిల్ వద్ద మేడా విజయ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట డిఎస్‌పి చైతన్య ఆధ్వర్యంలో రాజంపేట సిఐ పుల్లయ్య, నందలూరు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామిని ఆలయం చుట్టూ పల్లకీలో ఊరేగించి అనంతరం మాడవీధుల్లో భక్తులకు శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు దర్శనమిచ్చారు. స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజలకు ఆటో సేవలు: జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం జనసేన నాయకులు గురివిగారి వాసు, శంకర, శ్రీను ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటు చేసిన ఆటో సర్వీసులను జనసేన నాయకులు అతిగారి దినేష్, జనసేన అధికార ప్రతినిధి కీర్తన ప్రారంభించారు.

బ్రహ్మోత్సవాలలో నేడు: సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రథంపై శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇఒ నటేషన్ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

భవనంపై నుంచి కిందపడి విద్యార్థి మృతి

పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు
కొనసాగుతున్న విచారణ -కడప జిల్లా ఎస్‌పి అన్బురాజన్ వెల్లడి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా ఖాజీపేట మండలం కొత్త నెల్లూరులోని బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్లో ఈ నెల ఒకటవ తేదీ ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి సోహిత్ ఐదవ అంతస్తు నుంచి కింద పడి మృతి చెందినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిసి కెమెరాలను పరిశీలించిన తరువాత ఈ నెల 1వ తేదీ తెల్లవారుజామున 5.07 గంటలకు సోహిత్ ఒంటరిగా హాస్టల్లో ఉన్న మంచం మీద నుంచి లేచి ఇతర విద్యార్థులు నిద్రిస్తూ ఉండగా బయటికి వెళ్లాడని పేర్కొన్నారు. 5.08 గంటలకు పైఅంతస్తు మెట్లను వేగంగా ఎక్కాడని తెలిపారు. ఇనుప గేటు వద్దకు వచ్చి ఎవరూ లేని విషయాన్ని గమనించి గేటు తెరచి ఐదవ అంతస్తులో ఉన్న టెర్రస్ పైకి వెళ్లాడని చెప్పారు. 5.09 గంటలకు డిజిటల్ గేటు వద్ద అందుబాటులో ఉన్న పెద్ద రాయిని తెచ్చుకోవడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. కుదరకపోవడంతో దానిని అక్కడే వదిలేసారని తెలిపారు. దగ్గరలో ఉన్న ఒక బకెట్‌ని బోర్లించుకుని గోడ ఎక్కారని చెప్పారు. గోడపై పాదాల మట్టి ముద్రలు గమనించామని పేర్కొన్నారు. 5.10 గంటలకు గోడ పైనుంచి కిందకు దూకాడని తెలిపారు. భవనం మొదటి అంతస్తు దగ్గర వి ఆకారంలో ఉన్న ఇన్సులేటెడ్ విద్యుత్ తీగలపై పడి ఆరు నుంచి ఎనిమిది నిమిషాల పాటు వేలాడారని చెప్పారు. 5.18 గంటలకు హాస్టల్ ఆవరణలో నేలపై పడిపోయాడని పేర్కొన్నారు. 5.22 గంటలకు స్కూల్ సిబ్బంది రియాజ్ విద్యార్థి సోహిత్ పడి ఉండడాన్ని గమనించాడని తెలిపారు. విద్యార్థి వద్దకు పరిగెత్తి ఇతర సిబ్బందితో కలిసి విచారించారని చెప్పారు. కడుపునొప్పి అని చెప్పడంతో విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి విషయం తెలియజేశారని పేర్కొన్నారు. అతని మేనత్త స్కూల్ వద్దకు రాగా చికిత్స నిమిత్తం పంపించారని తెలిపారు. చెన్నూరులోని ఆర్ఎంపి డాక్టర్ వెంకటేష్ వద్ద ప్రథమ చికిత్స చేయించుకుని, రెండు గంటలైనా కడుపునొప్పి తగ్గలేదని, విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు 9:15 గంటలకు విద్యార్థి చనిపోయినట్లు నిర్ధారించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ సెక్షన్ 75 కింద పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐదో అంతస్తు నుంచి ఎందుకు కింద పడ్డారనే దానిపై విచారణ సాగుతోందన్నారు.

సహకార డెయిరీ ఏర్పాటుపై మాటతప్పిన సిఎం

ప్రజాశక్తి-రాయచోటి

వెసిపి అధికారంలోకొస్తే చిత్తూరు సహకార డెయిరీని పునరుద్ధరిస్తామని హామీఇచ్చిన సిఎం జగన్ మాటతప్పారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల కాదరబాషా పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డెయిరీ పునరుద్ధరణ పేరుతో అమూల్‌కు దారాదత్తం చేశారని విమర్శించారు. సహకార డైయిరీలను నిర్వహించే సత్తా ఇక్కడి వారికి లేదా అని ప్రశ్నించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారున్నారు. సహకార డెయిరీలకు ఒక్క రూపాయి సహాయం కూడా చేయలేదన్నారు. తన కేసుల మాఫీ కోసం ఎక్కడో గుజరాత్‌కు చెందిన అమూల్‌కు ఏడాదికి రూ.కోటికి లీజుపై 99 ఏళ్లకు అప్పగించారన్నారు. ఇది పాడి రైతులకు ద్రోహం చేయడం కాదా అని ప్రశ్నించారు. హామీలన్నీ ఇప్పుడు తుంగలో తొక్కారని విమర్శించారు. సమావేశంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అతావుల్లా, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు ఇనాం, తెలుగు యువత నాయకులు హాజైఫ్ నూర్ మొహమ్మద్, కృష్ణయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నిర్వహించే వాతావరణ మార్పులు-మానవుని ఆరోగ్యం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమద్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో "జాతీయ వాతావరణం మార్పులు - మానవుని ఆరోగ్యం కార్యక్రమం" నిర్వహణపై అన్ని శాఖల అధిపతులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యతని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించగలుగుతామని చెప్పారు. నేటి వేగవంతమైన జీవితంలో వాహన వేగం పెంచుతూ ఇంధన కొరతకి, వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నామని కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, లాంటి విషపూరిత వాయువులు వాతావరణంలో పరిమితికి మించి పెరగడం వలన క్రమంగా భూమండలం వేడెక్కుతోందన్నారు. అడవులు, జలవనరులు క్రమేపి తగ్గిపోతున్నాయని ఈ రకంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో సాధించిన పురోగతి కూడా ప్రకృతి కాలుష్యానికి కారణమవుతోందని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మొక్కలు నాటడం, సైక్లింగ్ చేయడం, ప్లాస్టిక్‌కి దూరంగా ఉండటం, ఇంధన వాడకాన్ని తగ్గించడం ద్వారా మన వంతు బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడుకుందాం పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, ఎన్‌సిడి అధికారి శేషగిరి బాబు, రైల్వేకోడూరు డిఎఫ్ఒ అనురాగ్ మీనా, డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్, జిల్లా విద్యా శాఖాధికారి పురుషోత్తం, పశుసంవర్ధక, పంచాయతీ రాజ్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


బాలసుబ్రమణ్యం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

'బాలు'కు భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-పీలేరు

గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రమణ్యంకు పీలేరు కళాకారులు, సామాజికవేత్తలు ఘన నివాళులు అర్పించారు. మంగళవారం స్థానిక విఎస్ నర్తనశాలలో ఎస్పీ బాల సుబ్రమణ్యం 77వ జయంతి వేడుకలు జరిగాయి. బాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమానులు, కళాకారులు, సామాజికవేత్తలు మాట్లాడుతూ బాలు బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. తన 50 ఏళ్ల సినీ జీవితంలో, 13 భాషల ద్వారా 50 వేల పాటలు పాడి శ్రోతలను మంత్రముగ్ధుల్ని చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన సినీరంగ సుదీర్ఘ ప్రస్థానంలో ఆరు జాతీయ పురస్కారాలు, దక్షిణ భారత దేశ స్థాయిలో ఆరు ఫిలింఫేర్ అవార్డులు, జాతీయ స్థాయిలో మరొక ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారన్నారు. 25 సార్లు ఉత్తమ గాయకుడు, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ డబ్బింగ్ ఆర్టిస్టు, ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారాలు కూడా అందుకున్నారని చెప్పారు. అతి ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ గౌరవాలను కూడా అందుకున్నట్లు తెలిపారు. ఈటివిలో పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా ఎంతో మంది గాయినీ, గాయకులను తెలుగు చిత్ర సీమకు పరిచయం చేశారని తెలియజేశారు. స్వతహా ఆయన మిమిక్రీ కళాకారుడు కావడంతో కథానాయకుల గొంతును అనుకరిస్తూ సహజంగా వారే పాటలు పాడినట్లుగా గానం చేశారన్నారు. ముఖ్యంగా ఎస్పీ బాలు మన తెలుగువాడు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన జ్ఞాపకాలను మనకు మనకు, మన భావితరాల కోసం మిగిల్చి వెళ్లారని చెప్పారు. ఈ మహా గాయకుడికి భారతరత్న ప్రకటించి గౌరవించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విఎస్ నర్తనశాల వ్యవస్థాపకులు, కళాకారుడు మయూర్‌నాథ్ శర్మ, కళాకారుడు, పాత్రికేయుడు 'ఆల్ ది బెస్ట్' ఖాదర్ బాష షేక్, మన సంస్కృతి కళా సంస్థ (తిరుపతి) వ్యవస్థాపకులు కలకట రెడ్డెప్ప, గౌరవ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త, పాత్రికేయుడు జానం గంగిరెడ్డి, గాయకుడు, పాత్రికేయుడు మస్తాన్, షైన్ సంస్థ అధ్యక్షులు బాబ్జాన్, ఎస్పీ బాలు, అభిమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా ఓటేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

భారతదేశంలో మూల నినాదమైన భిన్నత్వంలో ఏకత్వానికి వ్యతిరేకంగా కేంద్రంలోని కషాయ బిజెపి ప్రభుత్వం ఓ మెజార్టీ మతానికి అనుకూలంగా యూనిఫామ్ సివిల్ కోడ్ అనే చట్టాన్ని తీసుకోవచ్చేందుకు ప్రయత్నిస్తోందని డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్నో వర్గాల ప్రజలు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును ప్రవేశ పెట్టే సన్నాహాలు బిజెపి ప్రభుత్వం ముమ్మరం చేస్తోందనే ప్రచారం సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీలు ఉన్న వైసిపి యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును వ్యతిరేకంగా ఓటు వేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వానికి మైనార్టీలపై, భారత సంస్కృతిపైన చిత్తశుద్ధి ఉంటే బిల్లు యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లుపై వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కార్యదర్శి యహియా బాషా, మైనార్టీ నాయకులు వసీం, అక్తర్, నసీం భాయ్, హబీబ్, జిలానిబాషా, జక్రియాబాషా పాల్గొన్నారు.

జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు 2022 సంవత్సరానికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూనారని స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డునకు 2020, 2021, 2022 సంవత్సరాల్లో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంసా పత్రం, రూ.15 లక్షల నగదు అందిస్తారన్నారు. ఈ అవార్డు కోసం ఆన్‌లైన్ వెబ్ సైట్ https://awards.gov.in ద్వారా 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్రికెట్ స్టేడియం పూర్తికి చర్యలు : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని శివారు ప్రాంతమైన నక్కవాండ్లపల్లి సమీపంలో క్రికెట్ స్టేడియం పనులను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా క్రికెట్ పిచ్ ఎక్కడ, మట్టి చదును పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని త్వరగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం చుట్టూ ఫెన్సింగ్ పనులు కూడా త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. చేసే పనులన్నీ నాణ్యతతో మన్నికగా ఉండేలా చేపట్టాలన్నారు. సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్టేడియం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

జాతరను సామరస్యంగా జరుపుకోవాలి

- ఎస్‌పి గంగాధర్‌రావు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎంతో చరిత్ర కలిగిన బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. వేలాది మంది భక్తులు ఎదురుచూస్తున్న గంగ జాతర ఈ నెల 13వ తేదీన అత్యంత వైభవోపేతంగా, పటిష్ట బందోబస్తు మధ్యన నిర్వహించుకునేందుకు ఎస్‌పి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. బలిజిపల్లిలో స్వయంభుగా వెలసిన గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో సామరస్యంగా జరుపుకోవాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. జాతర నిర్వహణకు సాంగ్యాల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించేందుకు మంగళవారం ఎస్‌పి గంగాధర్‌రావు బలిజిపల్లి గ్రామస్తులు, జాతర నిర్వాహకులతో సమావేశమయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని అనంతరం జాతర నిర్వాహకులు, గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడుతూ 200 సంవత్సరాల చరిత్ర కలిగిన బలిజపల్లె గంగమ్మ తల్లి జాతరను వర్గ విభేదాలతో ఆపడం భావ్యం కాదని, ఇరువర్గాలు కలిసిమెలిసి జాతరను నిర్వహించాలని సూచించారు. జాతర సందర్భంగా ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే 107 సెక్షన్ కింద రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒకసారి భయంలో వర్క్ చేసిన నమోదైతే మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు ప్రతిసారి పోలీస్ స్టేషన్కు హాజరు కావాల్సి ఉంటుందని, విదేశాలకు వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితులు ఉంటాయని తెలిపారు. జాతర నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. జాతరకు తాము కూడా వచ్చి అమ్మవారిని దర్శించుకుంటామని పేర్కొన్నారు. జాతరకు తన వంతు కానుకగా రూ.500లు అందజేశారు. ఇదిలా ఉంటే 200 ఏళ్ళ చరిత్రలో ఎస్‌పి కలుగజేసుకొని జాతర నిర్వహించడం మొదటిసారి కావడం విశేషం. కార్యక్రమంలో డిఎస్‌పి చైతన్య, పట్టణ సిఐ నరసింహారావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి గంగాధరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి జవహర్‌బాబు

మలేరియాపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కలకడ

మలేరియా వ్యాధిపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ జవహర్‌బాబు ఆధ్వర్యంలో ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఎఎంఎలు, సూపర్వైజర్ సిబ్బంది కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. దోమకాటు వల్ల మలేరియా వస్తోందని దోమల నుంచి రక్షణ కోసం దోమ తెరలను వాడాలని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎల్‌సిడిసి కార్యక్రమంలో ఇంటింటి సర్వే చేయాలని, స్పర్శ లేని మచ్చలు వున్న వారిని గుర్తించా లని తెలిపారు.లెప్రసీ ప్రోగ్రాం జూలై 17 వరకు జరుగుతుందన్నారు. వరల్డ్ పాపులేషన్ డే గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, యంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, ముజీబ్‌బాషా, బి.రెడ్డమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

నందలూరులో వెలసిన శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ సౌమ్యనాథస్వామి శ్రీదేవి భూదేవి కల్యాణోత్సవం సందర్భంగా వచ్చిన వేలాది మంది భక్తుల కోసం జనసేననాయకులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన, అతికారి దినేష్ చలివేంద్రాన్ని ప్రారంభించి జాతరకు వచ్చిన ప్రజలకు మజ్జిగ, మంచి నీరు భక్తులకు అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉల్లి ఉపేంద్ర, మంకు వెంకటేష్, మస్తాన్ రాయల్, కొట్టే హరిష్, తిప్పాయ్యపల్లె ప్రశాంత్, గురివి గారి వాసు, పాటురు డాల, సునీల్ గౌడ్, పసుపులేటి వెంకటేష్, రాము, రత్నం, పాటురు సుబ్బయ్య, కొట్టె హరి, చెన్నంశెట్టి శివకుమార్, చెన్నంశెట్టి శివకృష్ణ, సుబ్బరాయుడు,పెంచలయ్య, గుగ్గిళ్ళ నాగర్జన, గుగ్గిళ్ళ వెంకటేష్,ఏం హేమంత్, పండ్రా రంజిత్, పోకల వెంకట సుబ్బయ్య, కువైట్ జనసేన నాయ కులు గంట రమేష్, కోలాటం హరి, పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుల్లంపేట



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న అరవింద ఆస్పత్రి సిబ్బంది

మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామంలో మంగళ వారం తిరుపతి అర వింద కంటి వైద్య శిబి రాన్ని గ్రామ సర్పంచ్ బోధనపు హలీమా ఆధ్వర్యంలో నిర్వ హించారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతూ చికిత్సకు డబ్బు లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చక్కటి అవకాశమని అన్నారు. కంటి సమస్యలు ఉన్న రోగులకు పరీక్షించి ఉచితంగా కంటిఅద్దాలు పంపిణీ చేసినట్లు తెలి పారు. కార్యక్రమంలో సిద్దు, వైసిపి వింగ్ సుదర్శన్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ వితరణ

రాజంపేట అర్బన్ : మండల పరిధిలోని డిబిఎస్‌పల్లె ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, విజన్ స్వచ్చంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మైక్ వితరణ చేశారు. మంగళవారం ఎంఇఒలు రఘునాథరాజు, సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో రూ.7వేలు విలువచేసే మైక్‌సెట్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివి.సుబ్బయ్యకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత బాగుందని కితాబునిచ్చారు. దాతల సహకారంతో పాఠశాలలో అన్ని వసతులను సమకూర్చి మండలంలోనే ఆదర్శ పాఠశాలగా కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఈ.చంద్ర, కార్యదర్శి నరసింహారాజు, మాజీ రీజన్ చైర్మన్ షేక్‌అబ్దుల్లా, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రాజు, ఉపాధ్యాయినీలు మదాలస, స్వర్ణలత, సుజాత, సుప్రజ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత బస్ పాసులు

మదనపల్లె అర్బన్ : పట్టణంలోని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ వివాహమైన సందర్భంగా సంఘంలోని సభ్యులు సభ్యులు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత బస్ పాసుల కోసం మదనపల్లి-2వ డిపో మేనేజర్ నిరంజన్, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.25వేలు చెక్ అందించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్‌లో ప్రయా ణించే విద్యార్థుల కోసం విరాళం అందించి, సరికొత్త ఆలోచనకు హెల్పింగ్ మైండ్స్ బృందం శ్రీకారం చుట్టారని అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు డంకన, అర్షద్, గౌతమ్,కిరణ్,అక్రం మంజు పాల్గొన్నారు.

'పది'లో తప్పిన విద్యార్థులకు సువర్ణావకాశం

మదనపల్లె అర్బన్ : పదవ తరగతి పరీక్షల్లో తప్పిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణావకాశం కల్పించినట్లు డిప్యూటి డిఇఒ కృష్ణప్ప తెలిపారు. మంగళవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాస్ ఎన్రోల్ మెంట్ వంద శాతం సాధించేందుకు ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని పదిలో తప్పిన విద్యార్థులను మళ్ళీ బడిలో చేర్పించాలన్నారు. వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పి ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ సుబ్బారెడ్డి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

'అల్లూరి' ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి



అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ గిరీష



అల్లూరి చిత్రపటానికి గౌరవ వందనం చేస్తున్న ఎస్‌పి

అల్లూరి సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని కలెక్టర్ గిరీష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో అల్లూరి జయంతి వేడుకలలో భాగంగా అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయన దేశభక్తి, ధైర్య సాహసాలు, త్యాగనిరతిని యువత అలవరచుకోవాలన్నారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు తన ప్రాణా లను పణంగా పెట్టిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శ ప్రాయ మన్నారు. పరాయి పాలకుల దోపిడీ, దమనకాండల నుండి విముక్తి కొరకు గిరిజనులను చైతన్యపరచి అల్లూరి సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుం దన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, సమాచార శాఖ డిపిఆర్‌ఒ పురుషోత్తం, కలెక్టరేట్ సెక్షన్ సూపరిం టెండెంట్లు, జిల్లా అధి కారులు, సిబ్బంది, అల్లూరి సీతారామరాజు చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **రాయచోటి టౌన్ :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుడు అల్లూరి సీతారా మరాజు అని ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు అన్నారు. మంగళవారం అల్లూరి సీతారా మరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లే యులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చని నమ్మి ఆచరణలో పెట్టిన మహనీ యుడు అల్లూరి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్‌పి డాక్టర్ విబి రాజ్‌కమల్, డిపిఒ, మినిస్ట్రియల్ సిబ్బంది, ఎస్‌బి, ఎఆర్, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట రూరల్ :** స్వాతంత్ర్య సంగ్రామంలో విప్లవ జ్యోతిని రగిలించిన విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డిలతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. **వీరబల్లి :** అల్లూరి సీతా రామరాజు 125వ జయంతి వేడుకలను మండలంలోని బస్టాండ్ ఆవరణంలో మండల టిడిపి అధ్యక్షులు భానుగోపాల్‌రాజు ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వ హించారు. ముందుగా ఆయన చిత్రప టానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మో హన్‌రెడ్డి, నాగ సుబ్బయ్య నాయుడు, జయచంద్రరెడ్డి, గ్రామ కమిటీ అధ్య క్షులు ఆంజనేయరెడ్డి, ప్రభాకర్‌నాయుడు రాజరాజు బాస్కర్‌రాజు, మహిళా కమిటీ అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ ,వెంకట రామ రాజు, లక్ష్మిరెడ్డి, సీతారా మరాజు, బాలరాజు, యర్రయ్య, నరసింహులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక జవుళీ బజారులోని సరస్వతీ విద్యా మందిరంలో అల్లూరి చిత్రపటానికి తెలుగు భాష సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకట రమణ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు కోడూరుగౌరీ, కృష్ణమూర్తి, హైమావతి, రేఖా రాణి, దయాకర్, రాజశేఖర్, పుష్పలత, కళ్యాణి, శ్రావణి పాల్గొ న్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బిసి వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామ చంద్రయ్య, కొర్లకుంట కృష్ణ, పటేల్, సాదుల్లా ఖాన్, బసయ్య, రమణ, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ పథకాలు అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆర్‌డిఒ ఎం.ఎస్ మురళి అన్నారు. మంగళవారం మండలంలోని ముషూరు, కొండయ్యగారిపల్లి గ్రామాలలో సర్పంచులు చంద్రాయుడు, వరలక్ష్మి, శశిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష గ్రామ సభలను నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు, తహశీల్దార్ సిఆర్.మంజుల, ఇఒపి ఆర్‌డి చలపతిరావు, డిటి తపస్విని, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలోని గట్టు పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిపి లక్ష్మీనరసమ్మ, జడ్‌పిటిసి రామచంద్రయాదవ్ ముఖ్య అతి థులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబెర్ ఎస్.నాసిర్‌వల్లి, గట్టు సర్పంచ్ ఉమా మహేశ్వరి, ప్రత్యేక ఆహ్వానితులు రామిరెడ్డి, ఎంపిటిసి రామసుబ్బారెడ్డి, తహశీల్దార్ రఫీక్ అహమ్మద్, ఎంపిడిఒ, శంకరయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. **కలికిరి :** స్థానిక మండల కేంద్రంలోని నాలుగో సచివాలయం నందు సురక్ష కార్యక్రమం మండల అభివృద్ధి అధికారి గంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, గృహ సారధుల కన్వీనర్ రెడ్డప్ప, గుట్ట పాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, సచివాల సిబ్బంది, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, కుమార్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు. **సుండుపల్లి :** స్థానిక మండల కేంద్రంలోని సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ రామచంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వ హించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి, పంచాయతీ సెక్రటరీ సురేష్‌బాబు, వైసిపి మైనార్టీ నాయ కులు రహిమాన్ ఖాన్ మధుసూదన్‌రెడ్డి , సచివాల సిబ్బంది వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీపై జిల్లాలో పనిచేస్తున్న టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రము లోని టీచర్లకు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కోసం కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణా తరగతులను నిర్వస్తుడటంలో భాగంగా మిట్స్ కళాశాలలో ఈ-కంటెంట్ పై శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ప్రభు త్వం ఇచ్చిన అవకాన్ని బాధ్యతగా తీసుకొని ఈనెల 15వ శిక్షణా కార్యక్రమాన్ని జరుపుతామన్నారు. ఇందులో బైజూస్ యాప్ ఎలా వాడాలి, స్మార్ట్ టివిలు వాడకం, ఐఎఫ్‌పిఎస్‌ల వాడకం గురించి అవగాహన కల్పిస్తారని చెప్పారు. టీచర్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ద్వారకానాథ్, శ్రీనివాసులు, శిక్షకులు భాస్కర్, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డు వలసపల్లి వద్ద ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యా విభాగం డిజిటల్ విద్య టెక్నాలజీ పై ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు , డిఇఒ జి.కృష్ణప్ప, ఎంఇఒ కె.ప్రభాకర్‌రెడ్డి, శివ రాంరెడ్డి, మధు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని నూలివీడు, సిసిపల్లి గ్రామల రైతులకు మామిడి పంటలో కాయల కోత తర్వాత ఆచరించవలసిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖధికారిణి టి.నాగమణి అధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలను పాటించినట్లైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్లకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించెల తలపైన కొమ్మలను, తూర్పు పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను, ఎండి పోయిన పూత కాడలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కార్యక్రమం రైతు భరోసా కేంద్ర సిబ్బంది రాణా ప్రతాప్, వికాస్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఎంపిపి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలను మంగళవారం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని తరగతి గదులను, వంటశాల, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం , గుడ్లు తదితర వాటి గురించి ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిన్నప్పటి నుంచి ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని ఐఎఫ్ఎస్ జాతీయ స్థాయి 31వ ర్యాంకర్, రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించిన నారా భువనేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక విజయ భారతి పాఠశాలలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ అజంతుల్లాఖాన్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సేతు ఐఎఫ్ఎస్ సాధించిన భువనేశ్వర్‌ను సన్మా నించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ మాట్లాడుతూ తాను ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చదివి శ్రీహరికోట రీసెర్చ్ సెంటర్లో కొన్ని రోజులు పనిచేశానన్నారు. అయితే సివిల్ సర్వెంట్‌గా పనిచేయాలన్న తన లక్ష్యాన్ని సాధించుకునేందుకు ఎంతగానో కష్టపడ్డాన్నారు.

వృద్ధులకు అందిస్తున్న సేవలు అమోఘం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువు మిట్టలో గల వెలుగు ప్రత్యేక పాఠశాలకు, వెలుగు వృద్ధాశ్రమానికి వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్, సెక్షన్‌ఆఫీసర్ ఎం.శ్రీకాంత్ సిబ్బంది మంగళవారం సందర్శించారు. వృద్ధాశ్రమంను సందర్శించి వృద్ధులను ప్రేమతో పలకరించారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక సాధికారిత మంత్రిత్వశాఖ సౌజన్యంతో నడుస్తున్న అలింకో సంస్థ వారు దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ, జీవన పరికరాలు జిల్లా పాలనాధికారుల ఉత్తర్వుల మేరకు ఉచితంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనా కుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాట ఆదాయం రూ.7.40 లక్షలు

బి.కొత్తకోట : వివిధ కేసుల్లో పట్టుబడిన 25 వాహనాలను మంగళవారం ఉదయం 11 గంటలకు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వేలం పాటను నిర్వహించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 21 ద్విచక్ర వాహనాలకు, నాలుగు కారులకు వేలంపాట నిర్వహించామని తెలిపారు. వేలంపాట ఆదాయం రూ.7,40 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బొజ్జనాయక్, కానిస్టేబుల్ శేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి సిఎం ప్రాధాన్యత

మదనపల్లె అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాడి రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్ఎ.కరీముల్లా పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరులో జరిగిన ముఖ్య మంత్రి బహిరంగ సభకు స్టేట్ ఇరిగేషన్ డైరెక్టర్ దండాల రవి చంద్రారెడ్డి, కార్యకర్తలతో కలసి తరలివెళ్ళారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ డైరీకి భూమిపూజ, శంఖుస్థాపన కార్యక్రమాలు సిఎంచేతుల మీదుగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఓ వెలుగు వెలిగిన విజయా డైరీ తిరిగి అమూల్ డెయిరీగా కార్య కలాపాలు ప్రారంభించడం వల్ల ఉమ్మడి జిల్లాల పాడి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కట్టుబడి మూతపడిన డైరీని తిరిగి వెలుగు లోకి తీసుకురావడాన్ని స్వాగతించారు.

అలుపెరుగని శ్రామికుడు ఆనందన్

మదనపల్లె అర్బన్ : సమాజ సేవలో చైతన్య సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం.పి.ఆనందన్ అలుపె రుగని శ్రామికుడని పట్టణంలోని పలువురు ప్రముఖులు కొనియాడారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు, వృద్ధులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆనందన్ జన్మదిన వేడుకలు కన్నుల పండుగలా జరుపుకున్నారు. ఈ వేడుకలకు విఎస్ఆర్ గ్రాండ్ అధినేత సుధాకర్‌రెడ్డి హాజరై శాలువతో ఆనందన్‌ను సన్మానించారు.

బైక్, టాటా మ్యాజిక్ వాహనం ఢీ

- ఇద్దరికి గాయాలు

పుల్లంపేట : బైక్, టాటా మ్యాజిక్ వాహనాలు ఢీ కొని ఇద్దరు గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బాసవాండ్లపల్లి చెందిన అన్నదమ్ములు అన్నయ్య, పెంచలయ్య బైక్ పై వస్తుండగా వెనక నుంచి వచ్చిన టాటా మ్యాజిక్ వాహనం అకస్మాత్తుగా ఢీకొనడంతో బైక్ పై ఉన్న ఇరువురికి గాయాలయ్యాయని తెలిపారు. అన్నయ్య ఆర్‌టిసి డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. క్షతగాత్రులను హుటాహుటిన 108 వాహనంలో రాజంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి పంపినట్లు చెప్పారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సిఐ సురేష్‌కుమార్

ప్రశాంత వాతావరణంలో జాతర : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

గ్రామదేవత ఎల్లమ్మ జాతర ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి ప్రజలందరూ సహకరించాలని సిఐ సురేష్ కుమార్ కోరారు. ఈనెల 9న ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఎల్లమ్మ జాతర సందర్భంగా ఏర్పాట్లను ఎస్ఐ రహీముల్లాతో కలసి పర్యవేక్షించి ఆలయ ధర్మకర్త అశోక్ రెడ్డితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా రోడ్డుకు ఇరువైపులా దూరంగా షాపులు ఏర్పాటు చేసుకోవాలని, దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు, ఆలయ సిబ్బంది సహకరించాలని కోరారు. రెండు రోజులు పాటు సోమల రోడ్డుకు వెళ్లే వాహనదారులు సంత గేటు రెడ్డివారిపల్లి మీదుగా పాత సాయిబాబా గుడి నుంచి వెళ్లాలని సూచించారు. రైల్వేశాఖ అధికారుల నుంచి అనుమతి కోసం చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాత ఎం.నీలిమా

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పట్టణంలోని చైతన్య స్కిన్‌కేర్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఎం.చందన్ కుమార్‌రెడ్డి మాతృమూర్తి ఎం.నీలిమా పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగవేణి, ఉపాధ్యాయులతో కలసి వెంకోజిగారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని సుమారు 30 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ఎం.నీలిమా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యార్థులు మంచి చదువులు చదువుకోవడానికి వారిని ప్రోత్సహిస్తూ తన వంతు సాయంగా నోటు పుస్తకాలను అందించామన్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామగ్రిని, నోటు పుస్తకాలను తన వంతు సాయంగా అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అనురాధ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నాగవేణి, మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు నాగరాజ పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతినివ్వొద్దు

ప్రజాశక్తి-సుండుపల్లి



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

స్థానిక సుండుపల్లె గ్రామపంచాయతీలోని ఏటిగడ్డరాచపల్లి సమీపంలో బాహు దానది నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని ఆ గ్రామస్తులు తహశీల్దార్ జి.రవికి వినతిపత్రం అందించారు. ఏటిగడ్డరాచపల్లి, పెద్దబలిజపల్లిలకు చెందిన రైతులు తాగునీరు, సాగునీరుకు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన తవ్వకాలతో నదిలో నీటిమట్టం తగ్గి నీటి వనరులు లేకుండా పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మరల ఇసుక తవ్వకాలకు అవకాశమిస్తే సాగునీటితో పాటు తాగునీటికి అవస్థలు తప్పవని గ్రామస్తులు తహశీల్దార్‌కు విన్నవించారు..

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -బి.కొత్తకోట

పట్టణంలోని మండల వనరుల కేంద్రం ఆవరణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు యూనిఫామ్ కిట్లను పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు పోలయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ విద్యార్థులతో సమానంగా విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు యూనిఫామ్, విద్యా సామగ్రి కిట్లను అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు, పాటలు నేర్పించి వారిలో చైతన్యం నింపుతున్నామన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 6న 25 కంపెనీల ప్రతినిధులతో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. జాబ్ మేళా ఏర్పాట్లపై మంగళవారం ఆయన తమ కళాశాలలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీలకు సంబంధించి సుమారు ఐదు వేల ఖాళీల భర్తీ లక్ష్యంగా దేశవ్యాప్తంగా పేరెన్నికగల 25 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటు న్నాయని తెలిపారు. పీలేరు వాసి, చెన్నైలోని సిసిఐ సీనియర్ డైరెక్టర్ అయ్యలరెడ్డి కిరణ్‌బాబు చొరవతో ఆ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అంగీకరించాయన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్ నుంచి పిజి దాకా విద్యార్హతలు ఉండి 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సున్న నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కావచ్చునన్నారు. గురువారం సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందని చెప్పారు. అదేరోజు జాబ్ మేళాతో పాటు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర తెలిపారు. మండలంలోని తలుపుల గ్రామంలోని సశ్య అగ్రో ఫార్మ్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి ప్రభుత్వం మంజూరు చేసిన మామిడి కలెక్షన్ సెంటర్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులకు సుస్థిరమైన ఆదాయం కల్పించడానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కలెక్షన్ సెంటర్లు, ప్రాసెసింగ్ సెంటర్లు మంజూరు చేస్తూందన్నారు. జిల్లాలో అధికంగా సాగు అవుతున్న మామిడి పంటకు గిట్టుబాటు ధర లభిం చేలా చూడడంలో భాగంగా ప్రస్తుతం తాము మామిడి పంటపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా వ్యాప్తంగా 52 కలెక్షన్ సెంటర్లు మంజూరు చేశామని, అందులో 17 సెంటర్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. ఉత్పత్తి దారుల సంఘాలు కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల సాధారణంగా మామిడి సీజన్లో కమీషన్‌పై ఆధారపడకుండా నేరుగా ఫ్యాక్టరీలకు మామిడిని సరఫరా చేసుకోవచ్చని అన్నారు. సరుకు రవాణా ఖర్చులు తగ్గి రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బౌదేషా వల్లి మాట్లాడుతూ మామిడిలో పంట కోతల అనంతరం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ సలహా మండలి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సశ్య అగ్రో ఫార్మ్ అధ్యక్షుడు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.